క్లుప్తంగా

లోక్ అదాలత్‌లో 76 కేసులు పరిష్కారం



పొన్నూరు: పట్టణంలోని అడిషనల్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 76 కేసులు పరిష్కారం అయ్యాయని తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎం. శ్రీధర్ తెలిపారు. సివిల్ - 2, క్రిమినల్ - 33, ఎక్సైజ్ - 29, చెక్ బౌన్స్ కేసు- 1, ఈపీ- 1, జీవీసీ- 1, బీఎస్‌యన్‌ఎల్‌పీఎల్‌సీ కేసులు- 9 పరిష్కారం అయ్యాయని పేర్కొన్నారు. ఈ కేసులలో కక్షిదారులకు రూ. 8,74,167 పరిహారం కింద అందించినట్లు తెలిపారు. అదాలత్ సభ్యులుగా మక్బుల్ బేగ్ వ్యవహరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. జయరాజ్, న్యాయవాదులు కె. సుబ్బారావు, పి.విజయ్‌కుమార్, ఎస్. శ్రీనివాసరావు, సీహెచ్. నాగరాజు, అంకమ్మరావు, బాజీ సాహెబ్, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నిఖిల్

గుంటూరు రూరల్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. లింగాయపాలెం గ్రామానికి చెందిన ఎల్లం నిఖిల్ చౌదరి ద్విచక్ర వాహనంపై చిలకలూరిపేట నుంచి విజయవాడ వెళుతున్నాడు. బుడంపాడు జంక్షన్‌లోని సాయి ట్రస్ట్ దగ్గరలో టర్నింగ్ తీసుకుంటూ బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నిఖిల్ అక్కడికక్కడే తీవ్రగాయాలతో మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా, మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతుని తండ్రి నరసింహారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


'కేర్'లో సీబీసీటీ 3డీ ఇమేజింగ్ ప్రారంభం



గుంటూరు రూరల్: పొత్తూరులోని కేర్ విద్య, వైద్య సంస్థలో శనివారం నూతన సీబీసీటీ 3డీ ఇమేజింగ్, ఐటీపీఏ విభాగాలతో పాటు ఏపీజే అబ్దుల్ కలాం లైబ్రరీలను తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కేర్ విద్యా సంస్థలో 80 శాతం యువతులు ఉండటం సంతోషకరమని పేర్కొన్నారు. కళాశాల, డెంటల్ ఆసుపత్రిని ఏర్పాటు చేసి ఎందరికో విద్య, వైద్యం అందిస్తున్న డాక్టర్ సయ్యద్ రసూల్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ సయ్యద్ జవహర్, కేర్ సంస్థల అడ్వైజర్ ఎంఆర్ మొహియుద్దీన్, కేర్ సంస్థల డైరెక్టర్ సయ్యద్ జీనత్, సయ్యద్ సమీనా, కేర్ డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాకీర్, డాక్టర్ మహబూబ్, డాక్టర్ స్మిత్, డాక్టర్ నూరు, డాక్టర్ సురేష్, డాక్టర్ శ్రీవిద్య, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల్లోనే వైవిధ్యమైన నాయకత్వ లక్షణాలు

విజ్ఞాన్ లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



చేబ్రోలు: మహిళల్లోనే వైవిధ్యమైన నాయకత్వ లక్షణాలు ఉంటాయని ఇస్రో హెచ్‌క్యూ డెప్యూటీ డైరెక్టర్ నిరుపమ తివారి అన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో శనివారం ఇంటర్నేషనల్ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బెంగళూరులోని ఇస్రో హెచ్‌క్యూ డెప్యూటీ డైరెక్టర్ నిరుపమ తివారి మాట్లాడుతూ ప్రతి రంగంలో మహిళల ప్రతిభను తెలియజేయడం ఈ ఉత్సవాల ప్రధాన లక్ష్యమని వివరించారు. రిపబ్లిక్ ఆఫ్ జింబాబ్వే ప్రెసిడెన్షియల్ అండ్ నేషనల్ స్కాలర్‌షిప్స్ డిపార్ట్‌మెంట్ ఆఫీస్ ప్రెసిడెంట్ అండ్ కేబినెట్ చీఫ్ డైరెక్టర్ డాక్టర్ వాడ్జనాని కచేరే మాట్లాడుతూ మహిళలు తమ గమ్యాలను చేరుకోవడంలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. నవభారత్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ డైరెక్టర్ యార్లగడ్డ త్రిపురాంబ మాట్లాడుతూ మహిళలు అవకాశాల కోసం ఎదురుచూడొద్దని, విజ్ఞానం, నైపుణ్యం పెంచుకుంటే ఏదైనా సాధించొచ్చని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు, అధ్యాపకులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీఈవో మేఘన కూరపాటి, వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ రఘునాథన్, డీన్లు పాల్గొన్నారు.

పురపాలికపై పన్ను బకాయిల బండ

- మొండి బకాయిలు వసూలుకు అధికారుల అవస్థలు
- 22 రోజుల్లో నూరు శాతం లక్ష్యం సాధించేనా ?
- పన్ను వసూలుకు ప్రత్యేక బృందాలు



పొన్నూరు పురపాలక సంఘ కార్యాలయం

పొన్నూరు: పట్టణ ప్రజల నుంచి వసూలయ్యే పన్నులే ప్రగతికి ఆధారం.. వాటితోనే పురపాలికలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. పన్ను వసూళ్లలో పొన్నూరు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రూ. కోట్లలో మొండి బకాయిలు పేరుకుపోయాయి. చేతుల కాలాక ఆకులు పట్టుకున్నట్లు మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇన్నాళ్లు పట్టించుకోని అధికార యంత్రాంగం పన్ను బకాయిలను రాబట్టేందుకు ప్రజలపై ఒత్తిడి పెంచింది. మొండి బకాయిల కారణంగా సక్రమంగా కట్టే వారిపై కూడా ఒత్తిడి చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. కొన్ని ప్రభుత్వ సంస్థలు పన్ను కట్టమని చెబుతుండగా .. మరికొందరు కనిపించకుండా మొండి బకాయిదారులుగా ఉంటున్నారు. ప్రభుత్వ భవనాలకు సంబంధించి రూ. లక్షల్లో బకాయిలున్నా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదు. బకాయి చెల్లించాలని అడిగితే ఉన్నతాధికారులను అడగమంటూ చెబుతున్నారు.

75 శాతమే వసూలు

గత 10 రోజుల నుంచి పన్ను వసూళ్లపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటి వరకు పొన్నూరు పట్టణంలో 75 శాతం వసూలు చేశారు. వివిధ పన్నుల రూపంలో మొత్తం రూ. 9.76 కోట్లు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ. 5.7 కోట్లు వసూలు చేశారు. మిగిలిన రూ. 4.69 కోట్లు 22 రోజుల్లో వసూలు చేయాల్సి ఉంది. ఇది సాధ్యమయ్యే పనేనా? అనే అనుమానాలు వస్తున్నాయి.

పన్నుల రాక ఇలా..

- పట్టణ పరిధిలోని 31 వార్డుల్లో 17 సచివాలయాల పరిధిలో మొత్తం 11,561 అసెస్‌మెంట్లకు రూ.5.74 కోట్లు పన్నులు ఏటా వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ.4.14 కోట్లు పన్నులు వసూలు చేశారు. ఇంకా రూ. 1.60 కోట్లు వసూలు చేయాల్సి ఉంది.
- పట్టణంలో ఉన్న 13050 నీటి కుళాయిలు ద్వారా రూ.1.27 కోట్లు రావాల్సి ఉండగా రూ. 54 లక్షలు మాత్రమే వసూలైంది. ఇంకా రూ.73 లక్షలు రావాల్సి ఉంది.
- ఖాళీ స్థలాలు 1,343 ఉన్నాయి. వాటి ద్వారా రూ.1.18 కోట్లకు గానూ రూ. 28 లక్షలు మాత్రమే వసూలు చేశారు. ఇంకా రూ. 90 లక్షలు రావాల్సి ఉంది.
- మొత్తం వివిధ పన్నుల రూపంలో రూ. 4.69 కోట్లను కేవలం 22 రోజుల్లో వసూలు చేయాల్సి ఉంది. వీటన్నింటికంటే అదనంగా ప్రభుత్వ కార్యాలయాల నుంచే రూ.1.46 కోట్లు పైగా బకాయిలు వసూలు కావాల్సి ఉంది.

పన్ను వసూళ్లలో 200 మంది సిబ్బంది

పట్టణంలో ఈ నెల 1వ తేదీ నుంచి నూరు శాతం పన్ను వసూళ్లే లక్ష్యంగా అధికారులు కార్యాచరణ చేపట్టారు. మొండి బకాయిదారులకు ఈ నెల 15 వరకు, సాధారణ పన్ను చెల్లింపుదారులకు ఈ నెల చివరి వరకు గడువు విధించారు. మున్సిపల్ ఆర్వో, డీఈ, ఏఈ తదితర అధికారులతో పాటు 17 సచివాలయాల సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పన్ను వసూళ్లలో నిమగ్నమయ్యారు. మొండి బకాయిదారులు 1600 మందికి ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ. 30 లక్షలు రావాల్సి ఉంది. ఈ నెల 15వ తేదీ వరకు పన్నులు చెల్లించని పక్షంలో వారి ఆస్తులను జప్తు చేసే విధంగా కార్యాచరణ రూపొందించారు. ఇప్పటికే దస్త్రాలను సిద్ధం చేశారు. ప్రధాన కూడళ్లలో మొండి బకాయిదారుల పేర్లతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నారు. ఆటోల ద్వారా ప్రచారం చేస్తున్నారు. పన్నులు వసూలుకు ప్రతీ రోజు ఉదయం 7. 30 గంటల నుంచి రాత్రి 7.30 గంటలు వరకు ప్రత్యేక కౌంటర్లు, ఆదివారాల- సహా పనిచేసేలా చర్యలు తీసుకున్నారు.

నూరు శాతం పన్ను వసూళ్లే లక్ష్యం



ప్రత్యేక బృందాలను పన్నులు వసూలుకు పంపించి నూటికి నూరుశాతం వసూలు చేయాలన్నదే లక్ష్యం.మొండి బకాయిదారులపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ఆస్తులను జప్తు చేయడంతో పాటు వారి వివరాలను ప్రకటిస్తాం. ఖాళీ స్థలాలు, నీటి పన్నులపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం.

– ముప్పాళ్ల రమేష్ బాబు. మున్సిపల్ కమిషనర్, పొన్నూరు

సందడిగా కళ్లం ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం



గుంటూరు రూరల్: విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతోపాటుగా సాంకేతిక నైపుణ్యాలపై పట్టు సాధించాలని, సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ సీనియర్ ఇంజినీర్ సీహెచ్. దినేష్‌రెడ్డి తెలిపారు. శనివారం చౌడవరంలోని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల 14వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ జీవితంలో ప్రతి మార్పును గమనిస్తూ దానికి అనుగుణంగా నిర్ణయాలు, ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. హైదరాబాద్‌కు చెందిన స్మార్ట్ బ్రిడ్జి సంస్థ వైస్ ప్రెసిడెంట్ శ్రీదేవి సిరా మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక విప్లవ మార్పులతో పాటు విద్యార్థులు త్వరితగతిన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యా సంవత్సరంలో విద్యార్థులు, కళాశాల సాధించిన ప్రగతిని కళాశాల డైరెక్టర్ ఎం. ఉమాశంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బి.ఎస్.బి. రెడ్డి వివరించారు. వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన 300 మంది విద్యార్థులకు రూ. 25 లక్షల స్కాలర్‌షిప్‌లను అతిథుల చేతులమీదుగా అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కళ్లం మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ పి. వెంకటేశ్వరరెడ్డి, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కళ్లం నవ్య, ఉపాధి కల్పన శాఖ ముఖ్య అధికారి పి.ఎల్. మాధవరావు పాల్గొన్నారు.

16,17 తేదీల్లో వ్యవసాయ కార్మిక సంఘం వర్క్‌షాప్

లక్ష్మీపురం: వ్యవసాయ రంగానికి కార్మికులు పట్టుకొమ్మలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ అన్నారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో శనివారం రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం వర్క్‌షాప్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16,17 తేదీల్లో మల్లయ్య లింగం భవన్‌లో జరిగే వర్క్‌షాప్‌లో వ్యవసాయ కూలీలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాబోతు ఈశ్వరరావు మాట్లాడుతూ దేశంలోని ప్రజలందరికీ ఆహార ఉత్పత్తి అందించడంలో వ్యవసాయ కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు తన్నీరు ప్రభుదాసు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీ విశ్వేశ్వరస్వామి కల్యాణం

నగరంపాలెం: బ్రాడీపేట 2/7వ అడ్డరోడ్డులోని శ్రీగౌరీవిశ్వేశ్వర దేవాలయంలో స్వామి నామ నక్షత్రం సందర్భంగా శనివారం కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. సరస్వతుల గణేష్, కుమారి, వంక ఉమా మహేశ్వరరావు ఉమాదేవి, మామిళ్లపల్లి శివపూర్ణప్రసాద్, విజయలక్ష్మి, మన్నవ వెంకటేశ్వరరావు, కృష్ణకుమారి, పులిపాక లక్ష్మి దంపతులతో అర్చకులు విశ్వేశ్వరశర్మ కల్యాణాన్ని జరిపించారు. ఏర్పాట్లను దేవాలయ అర్చకులు జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్‌శర్మ, మల్లికార్జునశర్మ పర్యవేక్షించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకుని, కల్యాణాన్ని తిలకించారు.



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నైపుణ్యాలే విజయానికి మూలాధారం



స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్న ఇన్ఫోసిస్ డీఎం సురేష్



విద్యార్థుల నృత్య ప్రదర్శన

అట్టహాసంగా ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల 40వ వార్షికోత్సవం

గుంటూరు రూరల్: పోటీ ప్రపంచంలో నైపుణ్యాలే విజయానికి మూలాధారమని, నూతన ఆవిష్కరణలతో సాంకేతిక విప్లవానికి విద్యార్థులు నాంది పలకాలని ఇన్ఫోసిస్ డీఎం సురేష్ నర్రా పేర్కొన్నారు. శనివారం చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల 40వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్‌తో కలిసి సురేష్ నర్రా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 317 మంది విద్యార్థులకు, ఒక్కొక్కరికీ రూ. 20వేల చొప్పున, మొత్తం రూ 63.40లక్షలను అందించారు. వివిధ కోర్సుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 19 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఎండోమెంట్ క్యాష్ అవార్డులను అతిథుల చేతుల మీదుగా ప్రదానం చేశారు. 2006-2007 విద్యా సంవత్సరం నుంచి ఇప్పటి వరకు 2,711 మంది విద్యార్థులకు మొత్తం రూ. 4,45,03,000ను స్కాలర్‌షిప్‌ల కింద అందజేసినట్లు కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ తెలిపారు. సినీ రచయిత కె. చంద్రబోస్ మాట్లాడుతూ ఉన్నత శిఖరాల చేరువకు ప్రతిభే ప్రధాన మార్గమని, చదువు, కళా ప్రతిభ రెండింటికీ సమాన ప్రాధాన్యతను అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. అతిథులను కళాశాల పాలకమండలి సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్, జాయింట్ సెక్రటరీ పి. గోపీచంద్, ప్రత్యేక ఆహ్వానితుడు కె. రంగారావు, ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు, కల్చరల్ కమిటీ ఇంచార్జ్ కన్వీనర్ రంగరాయ చౌదరి, కళాశాల వివిధ శాఖల విభాగాధిపతులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుకు సాగాలి



సెయింట్ ఆన్స్ కళాశాలలో వేడుకలు

గుంటూరు రూరల్: మహిళలు అన్నిరంగాల్లో ముదుకు సాగాలని జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్ తెలిపారు. శనివారం మండలంలోని వెంగళాయపాలెంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలో మహిళా స్నేహ పూర్వక గ్రామంగా జిల్లాలో ఎన్నికైన సందర్భంగా గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధితోనే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సతీమణి బూర్ల జయ రామాంజనేయులు, ప్రత్తిపాడు నియోజకవర్గ పరిశీలకురాలు భీమినేని వందనాదేవి, గ్రామ సర్పంచ్ నల్లపాటి లలితకుమారి, డాక్టర్ కె. మోహనరావు, ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, ఎస్. పద్మారాణి, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, ఈవో వాలిచర్ల రవి, ఉప సర్పంచ్ కె. మాధవి పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి

గుంటూరు రూరల్: మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని సమాజ సేవకురాలు సిస్టర్ హేకుళ మేరి తెలిపారు. శనివారం గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిస్టర్ మాట్లాడుతూ విద్యార్థులంతా ఇష్టంతో చదివి లక్ష్య సాధన దిశగా ఎదగాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ టి. సంధ్య మాట్లాడుతూ మహిళా హక్కుల రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీపీ సాహితి

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

చేబ్రోలు: నేడు మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని చేబ్రోలు ఎంపీపీ కొక్కిలగడ్డ సాహితి అన్నారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ఎంపీడీవో కె. లలిత అధ్యక్షత వహించారు. ఎంపీపీ సాహితి మాట్లాడుతూ మహిళాభివృద్ధికి, సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఎంపీడీవో లలిత మాట్లాడుతూ మహిళలు ఉన్నత చదువులు అభ్యసించడం ద్వారా పురోగతి సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో సూపరింటెండెంటు ఉమాదేవి, ఈవోపీఆర్డీ ఉషారాణి, వివిధ గ్రామాల సర్పంచులు వినీతారాణి, హైమావతి, చుక్కా సాయి నాగేంద్రమ్మ, మన్నెం శిరీష, జెడ్పీటీసీ మాజీ సభ్యులు మైలా రామరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశసేవలోనూ ముందుండాలి

పెదకాకాని: అన్ని రంగాల్లో దూసుకుపోతున్న మహిళలు దేశసేవలోనూ ముందుండాలని డాక్టర్ జయదీప్ మహేంద్ర తెలిపారు. మండలంలోని సిబార్ దంత వైద్య కళాశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల డీన్ డాక్టర్ ఎల్. కృష్ణమోహన్ అధ్యక్షత వహించి స్వాగతోపన్యాసం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జయదీప్ మహేంద్ర మాట్లాడుతూ ప్రతి మహిళ దుర్గామాత స్వరూపమని తెలిపారు. మహిళాభ్యున్నతి ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అనంతరం పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిబార్ డైరెక్టర్ డాక్టర్ టి. కృష్ణమోహన్, ప్రిన్సిపల్ డాక్టర్ బి.వి. రమణారెడ్డి, డాక్టర్ వై. సమత, డాక్టర్ ఈ. శ్రీదేవి, డాక్టర్ టి. దేవకి పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు.

మహిళా శక్తే ప్రపంచ శక్తి

గుంటూరు రూరల్: మహిళా శక్తి ప్రపంచ శక్తి అని, స్త్రీని ప్రకృతితో పోల్చుతారని విజయవాడ ఐఎంఐఎస్ ఫార్మాస్యూటికల్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.నాగలక్ష్మి తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళల హక్కులు, సమానత్వం, వారి సాధనలను గౌరవించే రోజని గుర్తు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ మహిళలు ప్రతి రంగంలోనూ విశేషమైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. మహిళా శక్తిని గుర్తించి, వారికి సమాన అవకాశాలు కల్పించడం మన బాధ్యతని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయినులకు క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి, అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీవో సాయికుమార్



సిబార్ దంత వైద్య కళాశాలలో మాట్లాడుతున్న డాక్టర్ జయదీప్



చలపతి ఫార్మసీ కళాశాలలో అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వేడుకలు

గుంటూరు రూరల్: మండలంలోని ఏటుకూరులో గల ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి పంచారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళలకు జగనన్న అందించిన సంక్షేమ పథకాలు, రక్షణ చట్టాలను మహిళా నేతలు గుర్తు చేసుకున్నారు. వైఎస్సార్ సీపీలో మహిళల ప్రాధాన్యతను, ప్రభుత్వంలో మహిళలకు జరిగిన మేలును నేతలు వివరించారు. అనంతరం పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మహిళా నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మహిళా నేతలు

పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యత అవసరం

పెదకాకాని: పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ ఇంటరాక్షన్ ప్రోగ్రాం ఏర్పాటు చేసినట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శనివారం ఎలక్ట్రికల్ కేబుల్స్, వైర్ తయారీ, ఉపాధి అవకాశాలపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా హెర్లిన్ ప్రాడక్ట్స్ అండ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పల్లె సోమేశ్వరరెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వైర్ డ్రాయింగ్ పరిశ్రమలలో విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు విద్యార్థులు సన్నద్ధం కావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ కె. గిరిబాబు, డైరెక్టర్ రావెల నవీన్, మెకానికల్ విభాగాధిపతి టి. శ్రీనివాసరావు, ఈఈఈ విభాగాధిపతి ఎ.వి. నరేష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సోమేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

వైద్య కళాశాలలో ప్రహరీ ప్రారంభం



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో నూతనంగా నిర్మించిన ప్రహరీని శనివారం గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ప్రారంభించారు. అనంతరం అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వైద్య కళాశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని అభినందించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.